ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి వచ్చిన ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు బండా ప్రకాశ్‌కు స్వాగతం పలుకుతున్న సంఘం నాయకులు

తెలంగాణచౌక్, జూన్ 30: సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన ముదిరాజ్ కులస్తులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. నగరంలోని సప్తగిరికాలనీలో గల ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక స్థానాలను ముదిరాజ్‌లు కైవసం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిట్టల వెంకటనర్సయ్య, రాష్ట్ర యువత అధ్యక్షుడు పండుగ బాలు, జిల్లా ప్రధాన కార్యదర్శి గీకురు రవీందర్, జిల్లా ఫిషరీస్ చైర్మన్ పిట్టల రవీందర్, నాయకులు బండారు భూమేశ్, నరేందర్, కొలిపాక మల్లికార్జున్ పాల్గొన్నారు.

'విద్యా దోపిడీపై ఉద్యమాలు చేపట్టాలి'

కమాన్‌చౌరస్తా, జూన్ 30: ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు చేస్తున్న విద్యా వ్యాపారం, దోపిడీపై ఉద్యమాలు చేపట్టాలని అఖిల భారత కిసాన్ ఫెడరేషన్(ఏఐకేఎఫ్) జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్‌రావు పిలుపునిచ్చారు. భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు వంగూరు వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మోర్తాల చందర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యాజమాన్యాలు, విద్యను వ్యాపారం చేస్తూ అడ్డు అదుపు లేకుండా దోపిడీ చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజ్ రీయింబర్స్ మెంట్లు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలోత్ రాజేశ్ నాయక్, రంగస్వామి, సహాయ కార్యదర్శి చంద గణేశ్, రాష్ట్ర కమిటీ సభ్యులు సంజయ్, నాగేశ్, వెంకట్, వీరబాబు, చంద్రకాంత్, రాకేశ్, మంగేశ్, రాజేశ్, వంశీ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కవులకు 'పెందోట' సాహిత్య పురస్కారాలు

విద్యానగర్, జూన్ 30: జిల్లాకు చెందిన ఇద్దరు కవులు 'పెందోట' సాహిత్య పురస్కారాలు అందుకున్నారు. సిద్దిపేటకు చెందిన శ్రీ వాణి సాహిత్య పరిషత్తు దశమ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక శివానుభవ మంటపంలో నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారాలను ప్రదానం చేశారు. కవిత్వ విభాగంలో కవి, రచయిత, కార్టూనిస్టు, తెలంగాణ రచయితల వేదిక కరీంనగర్ ఉపాధ్యక్షుడు పెనుగొండ బసవేశ్వర్ రచించిన 'ప్రశ్నను మింగిన కాలం' కవిత్వ సంపుటి, బాల సాహిత్య విభాగంలో కవి, రచయిత, విమర్శకుడు, భవాని సాహిత్య వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన 'బాలగేయ సారస్వతం' సంకలనం పురస్కారాలు ఎంపికయ్యాయి. ఈ మేరకు రచయితలిద్దరికి నగదు పురస్కారాలు అందజేసి, శాలువాతో సత్కరించారు. నిర్వాహకుడు పెందోట వెంకటేశ్వర్లతో పాటు కార్యక్రమానికి కరీంనగర్ నుంచి హాజరైన కవులు తోట నిర్మలారాణి, శ్రీరామ్ పుప్పాల, పెనుగొండ సరసిజ, గుండు రమణయ్య పురస్కార గ్రహీతలను అభినందించారు.

మీల్స్ ఆన్ వీల్స్ @ 366వ రోజు

లయన్స్ క్లబ్ బాధ్యులను సన్మానిస్తున్న సభ్యులు

విద్యానగర్, జూన్ 30: పేదల ఆకలి తీర్చేందుకు లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320జీ ఆధ్వర్యంలో చేపట్టిన లయన్స్ క్లబ్ మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమం ఆదివారం 366వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా ప్రతి రోజూ ప్రభుత్వ దవాఖాన ప్రాంగణంలో 200 మందికి పైగా అవసరార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఉచితంగా అందిస్తున్నారు. ఈ కార్యక్రమం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రతి రోజూ వలంటీర్లుగా సహాయం చేస్తున్న వారందరినీ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా గవర్నర్ లయన్ హనుమాండ్ల రాజిరెడ్డి, మీల్స్ ఆన్ వీల్స్ చీఫ్ కోఆర్డినేటర్ లయన్ మంద వెంకట రమణారెడ్డి, వివిధ క్లబ్బుల నుంచి వివిధ హోదా గల సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, కాళేశ్వరం ప్రాజెక్టు మాజీ ఈఎన్సీ నల్ల వెంకటేశ్వర్లు, తదితరులు

విద్యానగర్, జూన్ 30: స్థానిక జ్యోతినగర్‌లోని శ్రీ మహాలక్ష్మీ గోదాదేవీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి చతుర్థ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం కరీంనగర్ పట్టణ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో శ్రీ పద్మావతి అమ్మవారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు, సారె సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ ఆర్డీవో కుందారపు మహేశ్వర్, కాళేశ్వరం ప్రాజెక్టు మాజీ ఈఎన్సీ నల్ల వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, పద్మశాలీయుల ఇంటి ఆడబిడ్డైన శ్రీ పద్మావతి అమ్మవారికి సంప్రదాయాన్ని అనుసరించి పట్టు వస్త్రాలు తలంబ్రాలు, సారె సమర్పించామన్నారు. కార్యక్రమంలో పట్టణ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గడ్డం శ్రీరాములు, జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం, పోపా జిల్లా అధ్యక్షుడు పోలు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎలిగేటి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఆడ శిశువు అనధికార దత్తత: కేసు నమోదు

రాంనగర్, జూన్ 30: ఆడ శిశువును అనధికారికంగా దత్తత తీసుకున్న ఓ ప్రైవేట్ ఉపాధ్యాయుడితో పాటు అతడికి సహకరించిన మధ్యవర్తులపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కొత్త యాస్పాడకు చెందిన లింగాల రాజిరెడ్డి అనే ప్రైవేట్ ఉపాధ్యాయుడికి పిల్లలు లేకపోవడంతో దత్తత తీసుకునేందుకు మధ్యవర్తులను సంప్రదించాడు. ఈ క్రమంలో కరీంనగర్‌కు చెందిన వడ్డేపల్లి ఆంజనేయులు, మౌనిక దంపతులకు జనవరి 31న ఆడ శిశువు జన్మించింది. కుక్కరోల్ల పరశురాం, రాజిరెడ్డి బావమరిది రవీందర్ రెడ్డి మధ్యవర్తిత్వం చేసి ఆంజనేయులు కూతురిని నోటరీ ద్వారా దత్తత తీసుకున్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అనుమతి లేకుండా జరిగిన ఈ వ్యవహారంపై జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ చైర్మన్ జోగు తిరుపతి విచారణ జరిపి, టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చట్ట వ్యతిరేకంగా దత్తత తీసుకున్న లింగాల రాజిరెడ్డి, పాపను దత్తత ఇచ్చిన తల్లిదండ్రులు ఆంజనేయులు, మౌనిక, మధ్యవర్తులుగా వ్యవహరించిన పరశురాం, రవీందర్‌రెడ్డిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు టూ టౌన్ సీఐ విజయకుమార్ తెలిపారు.

ఘనంగా డాక్టర్స్ డే

వేదుకల్లో మాట్లాడుతున్న వైద్యుడు రాంకిరణ్

విద్యానగర్, జూన్ 30: ప్రపంచ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ జిల్లా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి రేకుర్తిలోని రాజశ్రీ గార్డెన్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని సీనియర్ వైద్యులను సన్మానించారు. నిరుపేదలైన వైద్య విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేందుకు వీలుగా కార్యాచరణ రూపొందించి ఐఎంఏ ఆధ్వర్యంలో కొనసాగించాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాంకిరణ్, డాక్టర్ వెంకట్ రెడ్డి, ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.

'రైతు భరోసా' రైతులకు మేలు చేసేలా ఉండాలి

వీణవంకలో సొసైటీ ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి

మానకొండూర్: మాట్లాడుతున్న సింగిల్‌విండో చైర్మన్ గోవిందరెడ్డి

- అభిప్రాయ సేకరణలో ముక్త కంఠంతో కోరిన రైతులు
- వివిధ సింగిల్ విండోల్లో ప్రత్యేక సమావేశాలు

శంకరపట్నం/ వీణవంక/ మానకొండూర్, జూన్ 30: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టనున్న రైతు భరోసా పథకం తమకు మేలు చేసేలా ఉండాలని రైతులు ముక్త కంఠంతో కోరారు. రైతు భరోసా పథకం అమలు తీరు, విధి విధానాలపై అభిప్రాయాలు కోరుతూ ఆదివారం జిల్లాలోని వివిధ సింగిల్‌విండోల కార్యాలయాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఇందులో భాగంగా శంకరపట్నం మండలంలోని గద్దపాక, మెట్‌పల్లి సింగిల్‌విండో కార్యాలయాల్లో మండల వ్యవసాయాధికారి ఆర్ శ్రీనివాస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతు భరోసాకు ఎన్ని ఎకరాలకు పరిమితి విధించాలి..? ఎంత చెల్లించాలి..? కౌలు రైతుల గుర్తింపు.., బోనస్ ఎవరికి చెల్లించాలి..? రైతు బీమా.. తదితర అంశాలపై పలువురు రైతుల అభిప్రాయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు రైతు భరోసా పథకం కొనసాగించాలని, తద్వారా రైతులకు మేలు జరిగేలా చూడాలని కోరారు. అలాగే రైతుబీమా పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని పలువురు రైతులు కోరారు. నోడల్ అధికారి శ్రీనివాస్, డీసీవో ఆడిటర్ మనోజ్‌కుమార్, చైర్మన్లు గుర్రాల తిరుపతిరెడ్డి, పొద్దుటూరి సంజీవరెడ్డి, వైస్ ఎంపీపీ రమేశ్, ఏఈవోలు, సీఈవోలు శ్రీనివాస్, సదయ్య, విండోల డైరెక్టర్లు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

• వీణవంక మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో 'రైతు భరోసా'పై రైతుల అభిప్రాయ సేకరణ కోసం ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన రైతులు మాట్లాడుతూ, రైతు భరోసాను ఎలాంటి ఐటీ రిటర్న్‌తో సంబంధం లేకుండా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఐదు ఎకరాల వరకు పెట్టుబడి సాయం ఇవ్వాలని కొంతమంది కోరగా, 10 ఎకరాల వరకు పథకాన్ని వర్తింపజేయాలని మరికొంత మంది అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అనంతరం సొసైటీ చైర్మన్ మావురపు విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో రైతుల అభిప్రాయాలు సేకరించామని, అధికారుల సమక్షంలో రికార్డులో నమోదు చేసి, ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చీఫ్ ఆడిటర్ మనోజ్‌కుమార్, ఆడిట్ ఆఫీసర్ శ్రీనివాస్, సీఈవో ప్రకాశ్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు మడుగూరి సమ్మిరెడ్డి, గెల్లు మల్లయ్య, సీహెచ్ శ్రీనివాస్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఏఈవో శ్రీకాంత్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

• మానకొండూర్ విశాల సహకార పరపతి సంఘం లిమిటెడ్ ప్రత్యేక సర్వసభ్య సమావేశం ఆ సంఘం అధ్యక్షుడు నల్ల గోవిందరెడ్డి అధ్వర్యంలో ఆదివారం కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టాదారు పాస్‌బుక్‌ను యూనిట్‌గా తీసుకుని 10 ఎకరాల భూమి ఉన్న ప్రతిరైతుకు రైతుభరోసా ఇవ్వాలని, ఎమ్మెల్యే, ఎంపీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, సాగుకు పనికిరాని భూములకు రైతుభరోసా ఇవ్వొద్దని తీర్మానించారు. అలాగే 10 ఎకరాల భూమి ఉండి ఇన్‌కంటాక్స్ రిటర్న్ చేసే రైతులకు కూడా రైతు భరోసా ఇవ్వాలని తీర్మానం చేసినట్లు సింగిల్ విండో అధ్యక్షుడు గోవిందరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి. సింగిల్‌విండో డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ ఇన్‌స్టాలేషన్ కేబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్ సునీల్‌రావు

- నగరంలో పెద్ద ఎత్తున వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు అందుబాటులోకి తెచ్చాం
- మేయర్ యాదగిరి సునీల్‌రావు

కార్పొరేషన్, జూన్ 30: నగర ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా తమ పాలకవర్గం పని చేస్తున్నదని మేయర్ యాదగిరి సునీల్‌రావు పేర్కొన్నారు. స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 303 అసోసియేషన్ ఇన్‌స్టాలేషన్ కేబినెట్ సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్, జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించి మాట్లాడారు. నడక ఆరోగ్యవంతమైన జీవనానికి దోహదపడుతుందని, ఇందుకోసం నగరంలో పెద్ద ఎత్తున వాకింగ్ ట్రాక్‌లు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. నగరంలోని 22 పార్కులను సుందరీకరించడంతో పాటు మైదానాలను కూడా అభివృద్ధి చేశామని, రూ.5 కోట్లతో 35 ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. రూ.11 కోట్లతో సుందరీకరించిన మల్టీపర్పస్ పార్కును ఈ నెల చివరి వారంలో ప్రారంభిస్తామని వెల్లడించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ 303 క్లబ్ తీసుకున్న ఎలాంటి నిర్ణయానికైనా నగరపాలక సంస్థ పక్షాన సహకారం అందిస్తామన్నారు. నగరాన్ని ఒక ఆరోగ్యమైన నగరంగా మార్చేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కరీంనగర్ స్మార్ట్‌సిటీగా పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందిందని, అది తమ పాలకవర్గానికి గర్వకారణమని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్ ఐలేందర్, సంస్థ ప్రతినిధులు ఎల్లాగౌడ్, అన్నమనేని సుధాకర్‌రావు, జగదీశ్వర్ గౌడ్, జీ రవీందర్, రమణారెడ్డి, గౌతమ్‌రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన 23 వాకర్స్ అసోసియేషన్ల సభ్యులు పాల్గొన్నారు.

కేపీఎల్-5 టోర్నీ విజేతగా యంగ్ ఫైటర్స్ జట్టు

శంకరపట్నం, జూన్ 30: కేశవపట్నం జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో కేశవపట్నం ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కేపీఎల్-5 టోర్నీలో యంగ్ ఫైటర్స్ జట్టు విజయకేతనం ఎగురవేసింది. నెల రోజుల పాటు కొనసాగిన ఈ పోటీల ఫైనల్ మ్యాచ్ ఆదివారం జరిగింది. కేశవపట్నం ప్రీమియర్ లీగ్-5 విజేతగా యంగ్ ఫైటర్స్ జట్టు ఆవిర్భవించగా, రన్నరప్‌గా క్లాసిక్ వారియర్స్ జట్టు నిలిచింది. టోర్నీ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ లక్ష్మారెడ్డి హాజరై మాట్లాడారు. యువత క్రీడల్లో రాణించాలని సూచించారు. విజేతలకు ట్రోఫీలు అందజేశారు. విజేతలకు ఎంపీటీసీ ఏనుగుల అనిల్ ట్రోఫీలు స్పాన్సర్ చేశారు. సీనియర్ క్రీడాకారులు గాజుల శ్రీనివాస్, వంగోజు సంపత్, పూరెల్ల ప్రశాంత్, బొంగోని మధూకర్, బీసీ సంఘం మండలాధ్యక్షుడు బొంగోని అభిలాష్, ఆదర్శ యూత్ అధ్యక్షుడు చెరుకు శివకుమార్, క్రీడాకారులు, పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

శంకరపట్నం, జూన్ 30: రోజు రోజుకూ సైబల్ నేరాలు పెరిగిపోతున్నాయని, యువత వీటిపై అవగాహన పెంచుకొని జాగ్రత్తగా ఉండాలని కేశవపట్నం ఎస్ఐ లక్ష్మారెడ్డి హెచ్చరించారు. ఆదివారం కేశవపట్నం హైస్కూల్‌లో సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలపై యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్ దుష్పరిణామాలపై వివరించారు. ఇక్కడ, పోలీసు సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

కాచాపూర్‌లో కొండచిలువ కలకలం

శంకరపట్నం, జూన్ 30: మండలంలోని కాచాపూర్ గ్రామంలో ఇండ్ల మధ్య కొండచిలువ ప్రత్యక్షం కావడం కలకలం రేపింది. ఓ పిల్లిని మింగుతుండగా గమనించిన గ్రామస్తులు దానిని కొట్టి చంపారు. గ్రామంలోని హనుమాన్ ఆలయానికి సమీపంలోని దారిలో జనావాసాల నడుమ ఓ కొండచిలువ ఓ పిల్లిని మింగుతున్న దృశ్యం అదే దారిలో వెళ్తున్న ఓ మహిళ కంట పడింది. వెంటనే ఆమె అరుపులకు అక్కడకు చేరుకున్న గ్రామస్తులు దానిని హతమార్చారు. అయితే అప్పటికే పిల్లి కూడా ప్రాణాలు కోల్పోయింది. జనావాసాల మధ్యకు అంత భారీ కొండచిలువ రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇక్కడ తరచూ చిన్న పిల్లలు ఆడుకుంటూ ఉంటారని పలువురు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.

టీం ఇండియా గెలుపుపై అల్ఫోర్స్‌లో సంబురాలు

సంబురాల్లో పాల్గొన్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్ రెడ్డి, విద్యార్థులు

కమాన్‌చౌరస్తా, జూన్ 30 : టీ-20 వరల్డ్ కప్ ఫైనల్‌లో టీం ఇండియా చారిత్రాత్మక విజయం సాధించగా, అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో అట్టహాసంగా సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, టీం ఇండియా ప్రపంచ కప్ గెలుచుకోవడం గర్వకారణం అన్నారు.

భారత క్రికెట్ జట్టుకు మేయర్ శుభాకాంక్షలు

కార్పొరేషన్, జూన్ 30: రెండో సారి టీ-20 ప్రపంచకప్ విజేతగా భారత్ నిలవడం చాలా హర్షణీయమని నగర మేయర్ యాదగిరి సునీల్ రావు పేర్కొన్నారు. టీ-20 ఫైనల్‌లో దక్షిణాఫ్రికాపై హోరాహోరీగా పోరాడి టైటిల్ సాధించి కీర్తి పతాకాన్ని ఎగురవేసిన టీం ఇండియా సభ్యులకు ఒక ప్రకటనలో ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

పెద్దమ్మ తల్లి బోనాల జాతరకు హాజరైన మేయర్

కమాన్‌చౌరస్తా, జూన్ 30 : జిల్లా కేంద్రంలోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పెద్దమ్మ తల్లి బోనాల జాతరకు మేయర్ వై సునీల్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వయంగా బోనం ఎత్తుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు డప్పు చప్పుళ్ల మధ్య భగత్‌నగర్, దేవుళ్లపురి, రాంచంద్రాపూర్ పెద్దమ్మ ఆలయాలకు ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చొప్పరి జయశ్రీ, తోట రాములు, ఆకుల నర్మద నర్సయ్య, పట్టణ ముదిరాజ్ సంఘం నాయకులు చొప్పరి వేణు, పండగ నాగరాజు, కుంభం అనిల్, కొలకాని నర్సయ్య, పిట్టల లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

సుహాసిని.. పేదోళ్ల డాక్టరమ్మ

డాక్టర్ సుహాసిని

- రిటైర్‌మెంట్ తర్వాత కూడా అవిశ్రాంత సేవలు
- హై రిస్క్ కేసుల్లోనూ ప్రాణాలు నిలబెడుతూ..
- మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా తిరిగి సేవలు

విద్యానగర్, జూన్ 30 : ఆమె పేదింట్లో పుట్టింది. ప్రభుత్వం కల్పించిన విద్యావకాశాలను సద్వినియోగం చేసుకుని మెడిసిన్ వరకు చదివింది. వైద్యుడైన తండ్రి బాటలో నడిచింది. ప్రభుత్వ వైద్యురాలిగా పేదలకు ఎనలేని సేవలు అందించింది. రిటైర్డ్ అయిన తర్వాత కూడా చిన్నక్లినిక్ పెట్టుకుని పేదలకు సేవలు అందిస్తున్న ఆమె, కొత్తగా నెలకొల్పిన ప్రభుత్వ వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరి తిరిగి సేవలు అందిస్తున్నారు. వైద్యం కోసం వచ్చిన ఎవరికైనా తానున్నానని ధైర్యం చెబుతూ, ఇప్పటికీ హైరిస్క్ కేసులకు అటెండ్ అవుతూ ఎన్నో ప్రాణాలను నిలబెడుతూ నేటితరం మహిళా వైద్యులకు ఆదర్శం నిలుస్తున్న డాక్టర్ సుహాసినిపై డాక్టర్స్ డే సందర్భంగా కథనం..

21 ఏండ్లు ఒకే దవాఖానలో సేవలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో డాక్టర్ సుహాసిని పేరు వినని వారుండరు. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన సుహాసిని ప్రాథమిక, ఉన్నత విద్య అక్కడి ప్రభుత్వ పాఠశాలల్లో, ఇంటర్ కూడా అక్కడి కళాశాలలోనే పూర్తి చేశారు. 1988లో ఆల్‌ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో ఎంట్రెన్స్ రాసి జాతీయ స్థాయిలో ఐదో ర్యాంకు సాధించారు. కేంద్ర పాలిత ప్రాంతమైన పాండిచ్చేరిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసి మూడేళ్ల పాటు అదే కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేశారు. ఆ తర్వాత పేదలకు వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో అప్పటి ఏపీపీఎస్సీ ద్వారా ప్రభుత్వ వైద్యురాలుగా నియమితులయ్యారు. 1997లో మొదటి పోస్టింగ్ వచ్చిన ఎల్ఎండీ కాలనీలోని ఏరియా దవాఖానలో ఏడాది పాటు విధులు నిర్వహించిన సుహాసిని, 1998లో వైద్య విధాన పరిషత్తుకు వచ్చి, కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో గైనకాలజిస్టుగా సేవలు అందించారు. తన 23 ఏండ్ల సర్వీసులో 21 ఏండ్లు ఇదే దవాఖానలో విధులు నిర్వహించిన ఏకైన వైద్యురాలు సుహాసిని.

లక్షకు పైగా ప్రసవాలు

ఉద్యోగ విరమణ తర్వాత డాక్టర్ సుహాసిని కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పరిధిలో ఉండే ప్రభుత్వ దవాఖానల్లో చాలా కాలం పాటు ఒకే ఒక గైనకాలజిస్టుగా పని చేశారు. రోజుకు 25 నుంచి 30 ప్రసవాలు చేసే వారు. ఒక్కో నెలలో 300-400 చేసేవారు. కరీంనగర్‌లో ఎంసీహెచ్ నెలకొల్పిన తర్వాత ఈ ప్రసవాలను మరింత పెంచారు. నెలలో 800 నుంచి 900 ప్రసవాలు జరిపి రికార్డు సృష్టించారు. ఈమె సర్వీసులో మొత్తంగా లక్షకుపైగా ప్రసవాలు చేసినట్లు చెబుతున్నారు. ఇక కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకైతే లెక్కే లేదు. 24 గంటలు దవాఖానలోనే గడిపేవారు. ఏ రాత్రి ఎలాంటి రోగులు వచ్చినా నేనున్నానని వచ్చి ప్రాణాలు కాపాడేవారు. మూడేండ్ల పాటు సూపరింటెండెంట్‌గా, రెండేళ్ల పాటు డీసీహెచ్ఎస్‌గా సేవలు అందించిన ఆమె హయాంలోనే ప్రభుత్వ దవాఖానలో అనేక మార్పులు జరిగాయి. ఐసీయూ, సిటీ స్కాన్, ఎంఆర్ఐ, మాతా శిశు ఆరోగ్య కేంద్రం, మిడ్‌వైఫరీ కోర్సులు వంటి అనేక సదుపాయాలు వచ్చాయి. టీహబ్ ఏర్పాటుకు ఈమె ఆధ్వర్యంలోనే రూపకల్పన జరిగింది. పేదల డాక్టర్‌గా ముద్ర పడిన సుహాసిని ముఖ్యంగా సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇచ్చారు. ఆమె రాకముందు కేవలం 20 శాతం కూడా జరుగని నార్మల్ డెలివరీలు ఆ తర్వాత 40 శాతానికి పెరిగాయి. సుహాసిని అనుసరించిన విధానంతోనే రాష్ట్రంలోనే కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు మంచి పేరు వచ్చింది. రిటైర్‌మెంట్ తర్వాత సుహాసిని ఇప్పుడు చిన్నక్లినిక్ పెట్టుకుని పేదలకు సేవలకు సేవలు అందిస్తూనే మెడికల్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రిటైర్‌మెంట్ తర్వాత విశ్రాంతి తీసుకోకుండా తిరిగి ప్రభుత్వ సేవల్లోకి రావడం ఆమెకు వైద్య వృత్తిపై ఉన్న మక్కువకు నిదర్శనం. నేటి తరం మహిళా వైద్యులు ఎందరికో సుహాసిని ఆదర్శనీయం.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

చొప్పదండి, జూన్ 30: పట్టణంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 1999-2000 విద్యాసంవత్సరంలో ఏడో తరగతి చదివిన, జిల్లా పరిషత్ పాఠశాలలో 2002-2003లో పదో తరగతి విద్యనభ్యసించిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనార్దన్, పూర్ణచందర్‌రావు, ప్రకాశ్, లక్ష్మీనర్సయ్య, విశ్వనాథం, ఊర్మిళాదేవి, అనితాదేవి, మంజుల, జలజారాని, మాధురి, వినోద, ఇందిర, యశోద, అరుణ, భారతి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, జూన్ 30: నగరంలోని 11కేవీ సంతోష్ నగర్ ఫీడర్‌లో మెయింటనెన్స్, లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు, ఇతర మరమ్మతులు చేపడుతున్న